క్లుప్తంగా

తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ రాజు



తహసీల్దార్‌కు మొక్కను అందిస్తున్న సిబ్బంది

దెందులూరు: ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా జి.విజయకుమార్ రాజు బుధవారం ఆయన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, ఆర్ఐ, వీఆర్‌ఓలు భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యులు కాకర్ల శ్రీను శాలువా జ్ఞాపకతో సత్కరించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయకుమార్ రాజు మాట్లాడుతూ ప్రణాళిక, పరస్పర సహాయ సహకారాలతో ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడిగా ఇంద్రకుమార్



ఇంద్రకుమార్‌ను సన్మానిస్తున్న విద్యా సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి అధ్యక్షుడిగా అల్లూరి ఇంద్రకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత పాలకవర్గానికి అధ్యక్షుడిగా ఉన్న ఇంద్రకుమార్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు కళాశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఇంద్రకుమార్‌ను పలు కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాప కులు, సిబ్బంది బుధవారం కళాశాలలో నిర్వ హించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.

23న ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలు

జంగారెడ్డిగూడెం: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర మహాసభలు ఈ నెల 23వ తేదీన జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్ తెలిపారు. చల్లవారిగూడెంలో ఏఐయూకేఎస్ ఆహ్వాన సంఘం నిర్మాణానికి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం కమిటీ సభ్యులు గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోసం ఏఐయూకేఎస్ పోరాడిందన్నారు. నేటి వరకు చేస్తున్న అనేక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని నూతన కమిటీ నిర్మాణానికి జంగారెడ్డిగూడెంలో నిర్వహించే సభలు జయప్రదం చేయాలని వారు కోరారు.

బడి.. కానరాని సందడి

- మొండి గోడలతో ఆహ్వానం
- నిలిచిన రూ.33.51 కోట్ల నాడు – నేడు నిధులు
- టీచర్లు ఉంటారా అనే అనుమానం
- మొత్తం విద్యార్థులు 14,960 మంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఏటా వలే జూన్ 12వ తేదీనే పాఠశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడం, అసౌకర్యాల నడుమ పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్యార్థుల తల్లిదండ్రులకు రుచించడంలేదు. గతంలో నాడు – నేడుతో అభివృద్ధి పాఠశాలలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా అప్పటి ప్రభుత్వం రెండో విడత నాడు – నేడు పనుల నిమిత్తం మంజూరు చేసిన నిధులను నిలిపివేసి పేదల చదువుపై ప్రభుత్వం కత్తికట్టినట్టు వ్యవహరిస్తోంది. సౌకర్యాలు లేకుండా పాఠశాలలు ఎలా తెరుస్తారని విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాలూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పునఃప్రారంభం సందర్భంగా ఉత్సాహంగా బడికి రావాలనుకునే విద్యార్థులకు నిరుత్సాహమే మిగిల్చింది కూటమి ప్రభుత్వం.

నాడు అభివృద్ధి

వైఎస్సార్ సీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద విద్యార్థులు అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అందుకు తగ్గ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అంతకుముందు ఎన్నడూ చూడని అభివృద్ధిని పాఠశాలల్లో చూపించారు. నాడు – నేడు కార్యక్రమం కింద తొలి విడతలో కోట్లాది రూపాయలతో 87 పాఠశాలలను రాజమందిరాల్లా తీర్చిదిద్దారు. మిగిలిన పాఠశాలలనూ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రెండో విడతలో మరో 67 పాఠశాలలను ఎంపిక చేసి, రూ.33.51 కోట్ల నిధులు మంజూరు చేశారు. వాటిని అవసరాన్ని బట్టి నిధుల విడుదలకు ఏర్పాటు చేయగా ఈలోపు ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో పాఠశాలల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. ఎక్కడ చూసినా మెండి గోడలు, శ్లాబులు వేసి గోడలు కట్టని భవనాలు, పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన తరగతి గదులు, వెలుతురు లేని తరగతి గదులు, ఎటువంటి సౌకర్యాలు లేని మరుగుదొడ్లు విద్యార్థులకు స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉన్నాయి.



ఆది ఆంధ్ర స్పెషల్ నగరపాలక పాఠశాల సింహద్వారం ఇలా..



చాటపర్రు జెడ్పీ హైస్కూల్ ఇలా స్వాగతం పలుకుతోంది

నీరసంగా బదిలీల ప్రక్రియ

ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి వల్లమాలిన నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు దూరం చేసింది. ప్రభుత్వం పెట్టిన అసంబద్ధ నిబంధనలకు నిరసనగా ఉపాధ్యాయులు రోడ్డెక్కే పరిస్థితి కల్పించింది. ఉపాధ్యాయసంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమ బాట పట్టడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు ఇదంతా జరిగే సరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. ఈ పరిస్థితిలో గత మూడు రోజుల నుంచి ఉపాధ్యాయుల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రారంభమయింది. సర్వర్లు మొరాయించడం బదిలీల ప్రక్రియ నీరసంగా కొనసాగుతోంది. బుధవారం ఏలూరు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మున్సిపాలిటీ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ ముగిసింది. అయితే రూరల్ ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల బదిలీలు జిల్లా పరిషత్, మండల పరిషత్ తదితర యాజమాన్యాలకు సంబంధించిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ కూడా పూర్తయితే గాని, సమస్య ఒక కొలిక్కి వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో పాఠశాలల పునః ప్రారంభానికి ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారా లేదా అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

సౌకర్యాల కల్పనలో విఫలం

ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 29.920 మంది విద్యార్థులున్నారు. నియోజకవర్గంలో నగరపాలక సంస్థ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల్లో మొత్తం 122 విద్యా సంస్థలు ఉన్నాయి. మొత్తం విద్యార్థుల్లో 1వ తరగతి 117, 2వ తరగతి 871, మూడో తరగతి 800, 4వ తరగతి 1014, 5వ తరగతి 1025, 6వ తరగతి 1348, 7వ తరగతి 1693, 8వ తరగతి 1917, 9వ తరగతి 2100, 10వ తరగతి 2108 మంది విద్యార్థులున్నారు. ఇంతమంది విద్యార్థులున్నా వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారనే అభిప్రాయం తల్లిదండ్రులనుంచి వ్యక్తమౌతోంది.

విద్యార్థి కిట్లు నిల్..

ఇదిలా ఉండగా విద్యా సంవత్సరం ఆరంభంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యా విషయక కిట్లు ఈ ఏడాది నియోజకవర్గ విద్యార్థులకు పాఠశాలలు తెరిచే నాటికి అందడం లేదు. ఏలూరు నియోజకవర్గంలో విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఇప్పటి వరకు కేవలం 54,261 పాఠ్యపుస్తకాలు, 57,156 నోటు పుస్తకాలు, 9,276 బెల్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన స్కూల్ బ్యాగులు, షూలు, యూనిఫారం దుస్తులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలుగానీ, పిక్టోరియల్ డిక్షనరీలు రాకపోవడం విద్యాశాఖ అధికారుల వైఫల్యంగా విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

బ్యాగ్‌లు లేకపోతే ఎలా?



విద్యా సంవత్సరం ప్రాంభం నాటికే సిద్ధం చేయాల్సిన విద్యార్థి కిట్లు ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఒక్క పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వస్తే సరిపోతుందా. అది కూడా అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు సమయానికి అందుతాయో లేదో అనుమానమే. విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు పెట్టుకోవడానికి బ్యాగులు ఇవ్వకపోతే వారు వాటిని ఎక్కడ పెట్టుకుని తీసుకువస్తారు.

– లెనిన్, జిల్లా నాయకుడు, ఎస్ఎఫ్ఐ

మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవీపేట పంచాయతీ ఎర్రకాలువ మిగులు భూముల్లో కొద్ది రోజులుగా అక్రమ తవ్వకాలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు విమర్శించారు. టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. కొద్ది రోజులుగా ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రిపూట మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తక్షణం వాటిని నిలుపుదల చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదేపల్లి సెక్షన్ పరిధిలో సుంకరవారితోటు 33/11 కేవీ ఫీడర్ పరిధిలో మాదేపల్లి, కాట్లంపాడు, లింగారావు గూడెం, పోణంగి చెరువులకు వెళ్లే లైను, మాదేపల్లి ఇందిరా కాలనీ లైన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో పెరుగుచెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్డు, నవాబ్ పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ, మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తానమి పేర్కొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డులో చినయాగినమిల్లి, పెదయాగినమిల్లి కోమటిలంక, కొక్కరాయలంక, పైడి చింతపాడు, ప్రత్తికోళ్లలంక, మొండికోడు, గుడివాకలంక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అంబేద్కర్ తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు విధి నిర్వహణలో విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏలూరు రూరల్ మండలం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ నరసయ్య కోరారు.

చింతలపూడి తహసీల్దార్‌గా నజీముల్లాషా

లింగపాలెం: మండల తహసీల్దార్‌గా నజీముల్లాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఏలూరు కలెక్టరేట్‌లో పని చేస్తూ ఇక్కడకు బదిలీపై నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్ పని చేశారు.

పుడమి తల్లికి ఏరువాక పూజలు

- ఘనంగా ఏరువాక పున్నమి
- వ్యవసాయ పనులకు రైతుల శ్రీకారం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో ఏరువాక పున్నమి వేడుకలను బుధవారం రైతులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తన సొంత పొలంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుడమి తల్లికి వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం ట్రాక్టర్లతో నాగలి దున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు, వ్యవసాయాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా విత్తు నుంచి విత్తనం కొనుగోలు వరకూ రైతులు ఎటువంటి కష్టం పడకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. పెట్టుబడి సాయం కింద నియోజకవర్గంలోని సుమారు 40570 మంది రైతులకు రైతు భరోసా పథకంలో సుమారు రూ.93.33 కోట్లు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే రైతులకు వ్యవసాయ పని ముట్లు, ట్రాక్టర్లు వంటివి వైఎస్ జగన్ అందించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులను కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ఏడాది రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎటువంటి పెట్టుబడిసాయం అందించలేదన్నారు. రైతులకు గ్రామంలోనే మెరుగైన సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏడాది కూటమి పాలన చూసిన రైతులు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలననే గుర్తు చేసుకుంటున్నారన్నారు.



నాగలితో దుక్కి దున్నుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



ఏరువాక పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

ఏరువాక ప్రత్యేక పూజలు

చింతలపూడి: మండలంలోని యండపల్లి గ్రామంలో కిసాన్ అంగడి బయో రిసోర్స్ సెంటర్, జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పున్నమి కార్యక్రమం నిర్వహించారు. కాడెద్దులు, నాగలికి రైతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ అంగడి వ్యవస్థాపకులు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ వర్ష రుతువులో జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని రైతులు ఏరువాక పున్నమిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రైతులు ఇప్పుడు దేశీ వరి విత్తనాలతో, రసాయనాలు లేని పద్ధతుల్లో ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించడంపై దృష్టి పెట్టాలని, ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన 20 మంది ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ఎస్ఎఫ్ఏపీ హుస్సేన్, బి.నరసింహారావు, జి.ఫ్రాన్సిస్ పుల్లారావు, రైతులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రాల పరిధిలో బుధవారం ఏరువాక పున్నమి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వేలం నిర్వహణాధికారులు జె.సురేంద్రకుమార్ అధ్వర్యంలో చల్లవారిగూడెంలో నిర్వహించగా, బి.శ్రీహరి ఆధ్వర్యంలో గుర్వాయిగూడెం గ్రామాల్లో నిర్వహించారు. చల్లవారిగూడెంలో రైతు సత్రం వెంకట్రావు పొలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు.



చల్లవారిగూడెంలో వర్జీనియా వేలం కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏరువాక పున్నమి

అలాగే గుర్వాయిగూడెంలో బాకి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు.

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



జంగారెడ్డిగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



కొయ్యలగూడెం: వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ కార్మికులకు కేంద్రం సమగ్ర చట్టాన్ని చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, దేశ వ్యాప్తంగా బుధవారం అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జేవీ రమణరాజు, సుంకర రాధాకృష్ణ (బాబు), బీకేఎంయూ నాయకులు గుదే ఆశీర్వాదం, నిట్టా రామారావు, మాండ్రు సాల్మేన్, కుంచె రాజశేఖర్, కుంచె మోహన్, కుంచె నాగేంద్ర, దొడ్డిగర్ల గాంధీ, తోట శిరీష, ధనవంత్రం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొయ్యలగూడెం: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గిరిజన రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ నాయకులు కారం దారయ్య, కొయ్యలగూడెం సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చింతలపూడి దుర్గారావు, దుగ్గిరాల నారాయణరావు, సతీష్, వంక సత్తిబాబు, సత్యనారాయణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ



విజయదుర్గమ్మకు పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మకు పౌర్ణమి తిథిని పురస్కరించుకొని పల్లకీసేవ నిర్వహించారు. సన్నాయి మేళ తాళాల నడుమ పట్టణ పురవీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు ప్రధాన అర్చకులు సుదర్శనం వేణు గోపాలచార్యులు, ఆలయ కమిటీ స హాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తూరులో తాగునీటి సమస్య

కొయ్యలగూడెం: తాగునీటి సమస్య పరిష్కరించాలని కొత్తూరు గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన కొత్తూరులో రెండు నెలల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాటర్ ట్యాంక్ నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే పంపు డ్రైవర్ లేకపోవడం వలన సమస్య ఏర్పడిందన్నారు. గతంలో స్థానికులు రోజుకొకరు వంతుల వారీగా ట్యాంక్ వద్ద విధులు నిర్వహించేవారు. అయితే ఉపాధి పనులకు వెళుతుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం అవుతుండడంతో కూలీనాలీ పనులు చేసుకునే తామంతా పొలం బాట, చెరువుల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. దీంతో తాగునీటి సమస్య తలెత్తిందని సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. అదే విధంగా తాగునీటి పైపులకు ట్యాప్‌లు బిగించకపోవడం వలన కొత్తూరు ప్రాంతంలో నీరు వృథాగా పోతుందని దానిని అరికట్టాలని కోరుతున్నారు.



తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	బీక్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	48
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	70
కాకర కాయలు	48	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	128
క్యాబేజీ	24	అల్లం	64
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	11
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	30